క్లుప్తంగా

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): చుట్టుగుంట శాతవాహన కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఫారెన్ సిటీ ఎగ్జిబిషన్‌ను సోమవారం రాత్రి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు, ఆహ్లాదానికి అందరూ దూరమవుతున్న వేళ నగరంలో కొత్తగా ఇలాంటి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వివిధ దేశాల్లో ఉన్న ప్రముఖ కట్టడాల నమూనాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరినీ అలరిస్తుందని చెప్పారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు అనీఫ్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో ఈఫిల్ టవర్, లండన్ బ్రిడ్జ్, సింగపూర్ ట్విన్ టవర్స్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయని తెలిపారు. అలాగే జెయింట్ వీల్, కొలంబస్, టోరాటోరా, బ్రేక్ డ్యాన్స్, చిన్న పిల్లల ఆటవస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. శాతవాహన కళాశాల ఛైర్మన్ నిడుమోలు రమా సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ అనిత, ఎగ్జిబిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించాలి



విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించి నగర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జాతీయ రోలర్ స్కేటింగ్ పతకాల విజేతలకు సూచించారు. చండీగఢ్‌లో ఇటీవల జరిగిన జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విజయవాడ క్రీడాకారులు బచ్చు వరణ్‌కృష్ణ, ఎం. సుచిత్ర, పోతల విజయడానియేల్, కొవ్వూరి శాన్విరఫియా, చేబోయిన అభిరామ్, బి.జతిన్‌లను కమిషనర్ తన చాంబర్‌లో సోమవారం అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకటసత్యనారాయణ, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు మాధవీకృష్ణ, కోచ్ దిలీప్ పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ 2024 క్యాలెండర్‌ను సోమవారం కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో మరింత ఉత్సాహంతో సేవలు అందించాలని తనకు శుభాకాంక్షలు చెప్పిన ల్యాబ్ టెక్నీషియన్స్‌కు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శి సౌభాగ్యం, కోశాధికారి ఫణికుమార్, ఉపాధ్యక్షుడు నరసింహారావు, సభ్యులు నాగేంద్రబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

4న దత్తపీఠంలో అనఘాష్టమి వ్రతం

పటమట(విజయవాడతూర్పు): పటమట అవధూత దత్తపీఠంలో ఈ నెల 4న అనఘాష్టమి వ్రతం నిర్వహిస్తున్నట్లు జయలక్ష్మి మాతృమండలి కన్వీనర్ స్రవంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో వ్రతం ప్రారంభమవుతుందని తెలిపారు. వ్రతంలో పాల్గొనాలనుకునే వారు 9491636317 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కలిసిమెలిసి పండుగలు జరుపుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి అన్నారు.
స్థానిక వినాయకనగర్‌లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన అసోసియేషన్ నాయకులతో కలిసి కేక్ కట్‌చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను అసోసియేషన్ అధ్యక్షుడు రవి పర్యవేక్షించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సీపీ రాణా



కేక్ కట్ చేస్తున్న స్వర్ణలత



కేక్ కట్ చేస్తున్న తోట శ్రీనివాస్



నున్న సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సర వేడుకలు నగరంలోని పలు చర్చిల్లో ఘనంగా జరిగాయి. ఆదివారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధురానగర్ కొబ్బరితోటలోని జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం క్రీస్తు సందేశాన్ని వివరించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే అంబేడ్కర్ కాలనీలోని సీయోను ప్రార్థనామందిరంలో పాస్టర్ రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్ కొవ్వొత్తులతో ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. రామకృష్ణాపురంలోని ఫుల్‌గాస్పల్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ డానియేల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేసి, సమాచార, పౌర సంబంధాల శాఖకు మరింత వన్నెతెచ్చేలా పని చేయాలని ఆ శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత కోరారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు అదనపు సంచాలకులు స్వర్ణలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక పథకాలు అమలు చేస్తోందన్నారు. 2024లోనూ శాఖ అధికారులు, సిబ్బంది కొత్త ఉత్సాహంతో పనిచేసి డిపార్టుమెంటుకు మంచి పేరు తీసుకురావాలని స్వర్ణలత సూచించారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్వీ మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పీఆర్వో వీవీ ప్రసాద్, ఏఐఈ వి.వరప్రసాద్, ఏవీఎస్ ఎ.సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సీపీ టి.కె.రాణా కేక్ కట్ చేసి పోలీసు అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు వి.అజిత, ఉదయరాణి, మోకా సత్తిబాబు, కె.చక్రవర్తి, ఏడీసీపీలు లక్ష్మీపతి, జి.వి. రమణమూర్తి, బి.ప్రసాద్, శ్రీనివాస రావు పాల్గొన్నారు.

నున్నలో..

నున్న(విజయవాడరూరల్): కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని నున్న గ్రామం సీఎస్ఐ చర్చిలో డీనరీ ఛైర్మన్ కొమ్ముకూరి జాన్ వెస్లీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే బోడపాడు ఆర్సీఎం చర్చి, ఫెయిత్‌టెంపుల్ చర్చి, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

61వ డివిజన్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు నత్త యోనరాజు, 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు గంటా రాణాదేవ్, శరత్, అన్నపురెడ్డి రామిరెడ్డి, కోలా పవన్‌కుమార్, కోటి, సౌజన్య, రామకృష్ణ, సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి పునాదులు కార్పొరేషన్ సిబ్బంది



మేయర్‌ను కలిసిన వీఎంసీ అధికారులు, సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): నగరం అభివృద్ధి చెందాలంటే దానికి మూలకారకులు కార్పొరేషన్ సిబ్బందేనని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో వీఎంసీ అధికారులు, కార్పొరేటర్లు, వీఎంసీ సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలంటే దానికి మూల కారణం కార్పొరేషన్ లో పనిచేస్తున్న సిబ్బందేనని అన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజాశ్రేయస్సుకు పని చేయాలన్నారు. అనంతరం మేయర్.. వీఎంసీ సిబ్బంది తీసుకొచ్చిన కేకును కట్ చేశారు. మేయర్, కమిషనర్‌ను కలిసిన వారిలో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, అడిషనల్ కమిషనర్ జనరల్ కె.శకుంతల, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ డి.వెంకటలక్ష్మి, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సెవెన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

పెన్షన్ పెంపు చారిత్రాత్మక నిర్ణయం



ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సరం కానుకగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెన్షన్‌ను మూడు వేల రూపాయలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో 391 మందికి నూతన పింఛన్లు మంజూరు చేసినట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో 17 వేల మందికి మాత్రమే పెన్షన్ అందేదని.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నెలలో పెరిగిన పెన్షన్‌లతో కలిపి 26,758 మందికి ఇస్తున్నట్లు వెల్లడించారు. చంద్రబాబు ప్రభుత్వం పింఛన్లలో పెద్దఎత్తున కోతలు విధించేదని.. కానీ పింఛన్ అర్హతను 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. నూతన సంవత్సరం కానుకగా రూ. 3 వేలకు పెంచి వారం రోజుల పాటు పండుగ వాతావరణంలో అందజేయనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన కోరారు.

విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన కార్పొరేటర్ మల్లీశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. స్థానిక దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జగనన్న స్ఫూర్తి స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మల్లీశ్వరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నాడు–నేడు ద్వారా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. విద్యార్థుల కోసం అన్ని సబ్జెక్టుల్లో ప్రత్యేకంగా తయారు చేయబడిన స్టడీ మెటీరియల్‌ను అందించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రభ, ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో నూతన సంవత్సర పూజలు



ముత్యాలంపాడు బాబా మందిరంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని పలు దేవాలయాల్లో నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు సోమవారం జరిగాయి. ముత్యాలంపాడులోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం అర్ధరాత్రి 12 తర్వాత బాబాకు విశేషంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి భక్తులకు మిఠాయిలు, బాబావారి క్యాలెండర్ పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాని దర్శించుకున్నారు. సోమవారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

రామకృష్ణాపురంలో..

రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో లక్ష తులసీ అర్చన నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ధర్మకర్త అద్దంకి సత్యనారాయణప్రసాద్, ఉప్పులూరి శేషప్రసాద శర్మ పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన స్వామివారికి విశేషంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి మందిరంలో..

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో సోమవారం బాబాకు విశేషంగా అలంకారం చేసి పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

వాకర్స్‌క్లబ్ సేవలు నిరుపమానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సమాజానికి అనేక విధాలుగా సేవలు చేస్తున్న బీఆర్టీఎస్ వాకర్స్ క్లబ్ సేవలు నిరుపమానమని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. స్థానిక దుర్గాపురంలో బీఆర్టీఎస్ వాకర్స్‌క్లబ్‌కు బెస్ట్ క్లబ్–2023 అవార్డు వచ్చిన సందర్భంగా అభినందన కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె క్లబ్ సభ్యులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు గుర్రం ఏడుకొండలు, కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్‌లు మాట్లాడుతూ ఈ అవార్డుతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. అనంతరం నూతన సంవత్సరం పురస్కరించుకుని కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య, శ్రీనివాస్, నాగమల్లిక, షఫీ, సాయి, శ్రీధర్, పోతుల విల్సన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర నామ పారాయణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ మండలి ఆధ్వర్యాన ముత్యాలంపాడులో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీ గోదా రంగనాథ స్వామివారికి ప్రత్యేక పూజలు అర్చనలు, శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రంగనాథ స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పైపులరోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అవడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. నున్న పోలీసులు తెలిపిన వివరాలు.. వాంబే కాలనీకి చెందిన పాడుగు రాజా అతని భార్య, కూతురుతో ఆదివారం రాత్రి సింగ్‌నగర్ నుంచి వాంబేకాలనీకి బైక్‌పై వస్తుండగా, పైపులరోడ్డు వద్ద మరో బైక్ అతివేగంగా వచ్చి రాజా బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో భార్య, కూతురుకి గాయాలు అయ్యాయి. రాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జిలో పేకాడుతున్న 11 మంది అరెస్ట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట తాడంకివారి వీధిలోని లాడ్జినందు పేకాడుతున్న 11 మందిని గవర్నర్‌పేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. లాడ్జిలో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెళ్లి సోదా చేయగా 11 మంది పేకాడుతూ కనిపించారు. వారి వద్ద నుంచి రూ. 7040 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అమర గాయకులను స్మరించుకోవాలి



విజయవాడ కల్చరల్: అమర గాయకులను నిత్యం స్మరించుకోవాలని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో అమర గాయకుల స్ఫూర్తి, ఆ పాత మధురాల సినీ సంగీత విభావరి గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు పాటకు అంతర్జాతీయ కీర్తిని తెచ్చినవారు ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం అని గుర్తు చేశారు. గాయనీ గాయకులు ఆ పాత మధుర గీతాలను ఆలపించారు. అనంతరం గాయనీ గాయకులను నిర్వాహకులు సత్కరించారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి, ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు ప్రభల శ్రీనివాస్, డాక్టర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.





సీఎం జగన్‌కు శుభాకాంక్షలు

కొత్త సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎన్టీఆర్ జిల్లా సీపీ టీకే రాణా, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వారు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భక్తజన కోలాహలం

- దుర్గగుడిలో క్యూలైన్లు కిటకిట
- సిఫార్సులకు చెల్లు...టికెట్లు ఉంటేనే దర్శనం



దుర్గగుడి ఆవరణలో భక్తుల సందడి



క్యూలైన్లలో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సర వేళ... ఇంద్రకీలాద్రిపై కొలువై భక్తజన కోలాహలం కనిపించింది. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు ఏకరీతిగా కొనసాగింది. క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తుల తాకిడితో సర్వ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. మరో వైపున బుధవారం నుంచి భవానీ దీక్షవిరమణలు ప్రారంభం కానుండటంతో ఘాట్‌రోడ్డులో క్యూలైన్ల నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో ఘాట్‌రోడ్డుపైకి ఎటువంటి వాహనాలను అనుమతించలేదు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డులో నడుచుకుంటూ కొండపైకి చేరుకున్నారు. మరో వైపున మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారానే భక్తులను కొండపైకి అనుమతించారు. రద్దీ నేపథ్యంలో లిఫ్టును సైతం మహా మండపం 5వ అంతస్తు వరకే అనుమతించారు. నూతన సంవత్సరం రోజు విద్యార్థులు భారీగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు.

టికెట్ల స్కానింగ్ కట్టుదిట్టం

వీఐపీల పేరిట వచ్చే వారిని టికెట్లు ఉంటేనే క్యూలైన్‌లోకి అనుమతించాలని ఈవో రామారావు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి అదనపు సిబ్బందిని సైతం నియమించారు. దీంతో స్కానింగ్ పాయింట్ వద్ద రూ. 500, రూ. 300 టికెట్టు క్యూలైన్‌లోకి ప్రవేశించాలంటే టికెట్లు తప్పని సరి అని సిబ్బంది పేర్కొడమే కాకుండా కఠినంగా అమలు చేశారు. దీంతో పలువురు భక్తులు ఆలయ సిబ్బందితో వాదనలకు దిగి ఈవోకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. గతంలో ఎక్కడా లేని రీతిలో సోమవారం టికెట్ల విక్రయం ద్వారా రూ. 10 లక్షలు పైబడే ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అమ్మవారిని పలువురు న్యాయమూర్తులు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస రావు దర్శించుకున్నారు.

సమష్టి కృషితో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

కలెక్టర్ ఢిల్లీరావు



కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పారదర్శకమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. సమష్టి కృషితో జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని అధికారులకు ఆయన సూచించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జేసీ పి.సంపత్ కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్‌కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించేందుకు జిల్లా అధికారులు, ఉద్యోగులు అందించిన సహకారం మరవలేనిదన్నారు. జిల్లాను 'మోడల్'గా తీర్చిదిద్దడంలో సహకారం అందించాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆర్డీఓలు పి.సాయిబాబు, కె.మాధవి, జిల్లా అధికారులు డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్వీ మోహనరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, సహకార అధికారి సీహెచ్ శైలజ, కలెక్టరేట్ ఏవో ఇంతియాజ్ బాషా, సాంఘిక సంక్షేమ అధికారి విజయభారతి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, పౌర సరఫరాల అధికారి జి.మోహనబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

డీసీపీ చక్రవర్తి



విద్యార్థినులతో డీసీపీ చక్రవర్తి

విజయవాడ స్పోర్ట్స్: పేద విద్యార్థినుల చదువుల కోసం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ట్రాఫిక్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.చక్రవర్తి అన్నారు. నగరానికి చెందిన విద్యార్థినులు లిఖిత(డిగ్రీ), సాహితి(ఇంటర్), జోలిక(ఎనిమిదో తరగతి) విద్యార్థినులకు సంస్థ సమకూర్చిన రూ. 40 వేలను డీసీపీ తన కార్యాలయంలో సోమవారం అందజేశారు. పేదరికం కారణంగా చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేసిన సాయాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చందన వెంకట్, ట్రాఫిక్ సీఐ రాజేంద్ర పాల్గొన్నారు.

సాంస్కృతిక సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి



సినీ గీతాలు పాడుతున్న రమాశంకర్

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని మురుగా చారిటబుల్ సంస్థ ఛైర్మన్ ఒమ్మి రమాశంకర్ అన్నారు. మురగా చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద నూతన సంవత్సర వేడుకలు, సినీ సంగీత విభావరి, పేదలకు నిత్యావసరాలు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రమాశంకర్ మాట్లాడుతూ ప్రతీ ఏటా వికలాంగులకు ట్రై సైకిల్స్, పేదలకు జీవన భృతి కోసం టీ బండి అందిస్తున్నట్లు తెలిపారు. గాయనీ గాయకులు రామభద్రకుమార్, సింధూ, కృష్ణకుమారి తదితరులు చిత్ర గీతాలను ఆలపించారు.